# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 200  పేజీలు : 04  వెల రూ. 2  మంగళవారం  27 - 01 - 2026




భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా'గూగుల్' ప్రత్యేక డూడుల్

## తెలంగాణలో ఘనంగా
# రిపబ్లిక్ డే వేడుకలు

**జాతీయ జెండా ఎగరేసిన గవర్నర్**

- తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్
- అసెంబ్లీ, మండలి, సచివాలయంలోనూ రిపబ్లిక్ డే సంబరాలు
- సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకున్నారు
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దేశభక్తి వాతావరణం నెలకొంది



హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అధికారిక కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, - మిగతా 2 లో

## 'ప్రెస్' స్టిక్కర్లపై తెలంగాణ
# సర్కార్ కీలక నిర్ణయం




- ఇకపై అక్రిడిటేషన్ వారికే అనుమతి
- నకిలీ జర్నలిస్టులపై తెలంగాణ సర్కార్ ఉక్కుపాదం
- వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్లకు అక్రిడిటేషన్ తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాతో పాటు వాహనం సీజ్
- అనధికారిక స్టిక్కర్లపై త్వరలో పోలీస్, రవాణా శాఖల స్పెషల్ డ్రైవ్
- వృత్తి గౌరవాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయమన్న ప్రభుత్వం

హైదరాబాద్ : మీడియా ముసుగులో చెలామణి అవుతున్న నకిలీ జర్నలిస్టులకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అధికారిక అక్రిడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ - మిగతా 2 లో

## ప్రజానాడి




## గణతంత్ర దినోత్సవం వేళ..
## జిన్‌పింగ్ నుంచి సానుకూల సందేశం

- గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్‌కు జిన్‌పింగ్ శుభాకాంక్షలు
- డ్రాగన్, ఏనుగు కలిసి నృత్యం చేస్తున్నాయన్న చైనా అధ్యక్షుడు
- గల్వాన్ ఘర్షణ తర్వాత మెరుగుపడుతున్న ఇరుదేశాల సంబంధాలు
- గతేడాది మోదీ, జిన్‌పింగ్ భేటీతో మొదలైన సానుకూల మార్పు


2 లో


## భిన్నత్వంలో
# ఏకత్వం.

- తలపాగాతో సందేశమిచ్చిన ప్రధాని మోదీ
- 77వ గణతంత్ర వేడుకల్లో రాజస్థానీ తరహా తలపాగాతో ప్రధాని
- ఎరుపు రంగు టై-డై వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో ప్రత్యేక ఆకర్షణ
- ప్రతి ఏటా విభిన్న సంస్కృతులకు ప్రతీకగా తలపాగాలు ధరిస్తున్న మోదీ
- గతేడాది ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగా ధరించిన ప్రధాని
- "వందేమాతరం - 150 ఏళ్లు" అనే థీమ్‌తో ఈ ఏడాది వేడుకలు



ఢిల్లీ : భారతదేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న వేళ, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తన ప్రత్యేకమైన తలపాగాతో అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో దేశంలోని ఏదో ఒక ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా తలపాగా ధరించడం మోదీకి అలవాటు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఈసారి రాజస్థానీ శైలిని పోలిన తలపాగాలో కనిపించారు. ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించిన ప్రధాని మోదీ, ఎరుపు రంగు టై-డై - మిగతా 2 లో

## కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి



- కర్తవ్యపథ్‌లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు
- వేడుకలపై పూలవర్షం కురిపించిన 4 ఎంఐ-17 హెలికాప్టర్లు
- పరేడ్‌లో పాల్గొన్న ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక బృందం
- ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థను ప్రదర్శించిన త్రివిధదళాలు
- అనంతరం రోదసీ యాత్ర చేసిన గ్రూప్ కెప్టెన్ శుభాంసు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అశోక్ చక్ర ప్రదానం

ఢిల్లీ : దేశ రక్షణ సామర్థ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ 77వ గణతంత్ర వేడుకలు దేశ రాజధాని ఢిల్లీలో అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. తొలుత రాష్ట్రపతి భవన్ నుంచి విదేశీ అతిథులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంప్రదాయ గుర్రపు బగ్గీలో అశ్విక దళంతో కలిసి కర్తవ్యపథ్‌కు బయలుదేరారు. కర్తవ్య పథక్‌కు చేరుకున్న రాష్ట్రపతికి, విదేశీ అతిథులు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో - మిగతా 2 లో

## విజయవాడ
## లోక్ భవన్‌లో 'ఎట్ హోం'

- హాజరైన చంద్రబాబు, పవన్, లోకేశ్
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఆధ్వర్యంలో 'ఎట్ హోమ్'
- వివిధ రంగాల ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులతో సందడిగా లోక్ భవన్
- ఆత్మీయ పలకరింపులతో ఆహ్లాదకరంగా సాగిన కార్యక్రమం
- కట్టుదిట్టమైన భద్రత నడుమ ఘనంగా ముగిసిన తేనీటి విందు



అమరావతి : 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సాంప్రదాయ తేనీటి విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు - మిగతా 2 లో

## కలిసికట్టుగా పనిచేస్తే
## దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా...

- రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన లూథరన్ చర్చిని ప్రారంభించిన మంత్రి
- దేవుడు పెట్టే పరీక్షలను జయించే శక్తిని కూడా ఇస్తాడని ఉద్బోధ
- కులమతాలకు అతీతంగా ఐక్యంగా పనిచేసి అభివృద్ధి సాధిద్దామన్న లోకేశ్
- కష్టాల్లో ఉన్న తోటివారికి అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉందని వ్యాఖ్య



అమరావతి : అందరూ ఐక్యంగా, కలిసికట్టుగా పనిచేస్తే మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకోవచ్చని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి పట్టణంలోని ఆత్మకూరులో ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు కరుణాలయం ద - మిగతా 2 లో

## అమరావతిలో మొదటిసారిగా
# రిపబ్లిక్ డే వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్
- సభా ప్రాంగణం వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్
- రాష్ట్ర ప్రగతిని చాటేలా 22శకటాల ప్రదర్శన
- అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు జరగడంపై సీఎం చంద్రబాబు హర్షం
- ఈ రిపబ్లిక్ డే ఏపీ ప్రజలకు చిరస్మరణీయమని వ్యాఖ్య
- ప్రభుత్వ ఎజెండాను వివరించిన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సీఎం
- పరేడ్, శకటాల ప్రదర్శన భవిష్యత్ ఆకాంక్షలకు అద్దం పట్టాయన్న చంద్రబాబు
- ఈ వేడుకలు రాష్ట్ర భవిష్యత్ లక్ష్యాలకు అద్దం పట్టాయన్న పవన్
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో అమరావతి విశ్వనగరం అవుతుందని ఆకాంక్ష
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన ఉంటుందని హామీ





అమరావతి : రాజధాని అమరావతి వేదికగా ప్రభుత్వం తొలిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించింది. హైకోర్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. సభా ప్రాంగణం వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు స్వాగతం పలికారు. గవర్నర్ జాతీయ జెండా ఎగురవేశారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## విద్యతోనే అభివృద్ధి!




మానవుల జీవితాన్ని మార్చడానికి విద్య ఒక ముఖ్య సాధనం. ఒక వ్యక్తి జీవన ప్రమాణాన్ని, నాణ్యతను, జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, మంచి దృక్పథాన్ని విద్య మెరుగుపరుస్తుంది. మనుగడ కోసం, ఉపాధి కోసం, మంచి జీవనం సాగించేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునేందుకు విద్య అవసరం. అలాగే మంచి మానవ సంబంధాలను అభివృద్ధి చేసుకొనేందుకు, గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు, ఆమోదయోగ్యమైన నడవడికలు నేర్చుకునేందుకు, వ్యక్తిత్వ వికాసానికి విద్య ఉత్తమ సాధనం. విద్య లేకుండా ఏ దేశం అభివృద్ధి సాధించలేదు. ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఉత్తమమైన విద్యా సంస్కరణల అమలు కోసం ప్రచారం కల్పించడానికి, సామాన్యుడికి సైతం విద్య అందుబాటులో ఉండడానికి ప్రతి దేశంలో విద్యా దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.పపంచవ్యాప్తంగా దాదాపు 25 కోట్ల మంది పిల్లలు, యువకులు పాఠశాలకు వెళ్లి చదువుకోలేకపోతున్నారు. సుమారు 76.5 కోట్ల మంది పెద్దలు నిరక్షరాసులుగా ఉన్నారు. భారతదేశంలో తల్లిదండ్రులు సగటున ఒక విద్యార్థిపై 18,479 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మన కేంద్ర ప్రభుత్వం 202526 బడ్జెట్‌లో విద్యకు నిధులు పెంచినా, ప్రపంచ సగటుతో పోలిస్తే తక్కువే. విద్యపై ప్రపంచ సగటు 4.48శాతమైతే, భారత సగటు మాత్రం నాలుగు శాతమే. మన దేశంలో విద్యను బాలల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ విద్యాహక్కు చట్టం చేశారు. 614 ఏళ్ల మధ్య వయసు బాలబాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో చేరి చదువుకునేలా చూస్తూ, వారికి ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ వయసు పిల్లలు 92 లక్షల మంది పాఠశాల వెలుపలే ఉండిపోతున్నారు. పాఠశాలల్లో చేరని, లేదా మధ్యలోనే చదువు మానేసిన వీరందరినీ తిరిగి చదువుల బాట పట్టించటం విద్యాహక్కు చట్టం ముఖ్యోద్దేశం. మన దేశంలో కావచ్చు ప్రపంచవ్యాప్తంగా కావచ్చు ఉన్నత విద్యకు కూడా నిధులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. చాలా దేశాలలో విద్యార్థులు ఉన్నత విద్యలో చేరలేకపోతున్నారు, కారణం అది ఖరీదైనది కావటమే. ఉపాధ్యాయులపై ఇతర పనుల ప్రభావాన్ని తగ్గించి వారిని బోధనలో మాత్రమే నిమగ్నం చేయాలి. విలువలతో కూడిన విద్యను అందించడంలో, చదువుకున్న ప్రతి వాడికి ఉపాధి దొరికేటట్లు చూడాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉన్నది.

# భిన్నత్వంలో ఏకత్వం

**మొదటిపేజీ తరువాయి** – వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో కూడిన తలపాగాను ధరించారు. సిల్క్ బ్రోకేడ్ వస్త్రంతో తయారు చేసిన ఈ తలపాగా రాజస్థానీ హస్తకళా నైపుణ్యాన్ని గుర్తుకు తెచ్చింది. దీనికి మ్యాచింగ్‌గా నీలం, తెలుపు రంగుల కుర్తా-పైజామా, లేత నీలం రంగు జాకెట్‌ను ధరించారు.ప్రధాని మోదీ 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి గణతంత్ర దినోత్సవాల్లో విభిన్నమైన తలపాగాలు ధరించడం ఒక సంప్రదాయంగా మారింది. ఇవి కేవలం ఫ్యాషన్ కోసం కాకుండా, భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తారు. గతేడాది 76వ గణతంత్ర దినోత్సవం నాడు రాజస్థాన్, గుజరాత్‌లలో ప్రసిద్ధి చెందిన ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగాను ధరించారు. గతంలో ఉత్తరాఖండ్ టోపీ, బహుళవర్ణ బాంధనీ ప్రింట్లు వంటివి ధరించి వివిధ రాష్ట్రాల సంస్కృతులకు గౌరవమిచ్చారు.జాతీయ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పించిన అనంతరం, ప్రధాని కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్‌ను వీక్షించడానికి చేరుకున్నారు. జాతీయ గీతం వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా "వందేమాతరం - 150 ఏళ్లు" అనే థీమ్‌తో ఈ ఏడాది వేడుకలను నిర్వహిస్తున్నారు.

# గణతంత్ర దినోత్సవం వేళ జిన్‌పింగ్ నుంచి సానుకూల సందేశం

**మొదటిపేజీ తరువాయి** – భారత 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్, చైనాలు మంచి పొరుగు దేశాలని, స్నేహితులని, భాగస్వాములని ఆయన అభివర్ణించారు. చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా ఈ వివరాలను వెల్లడించింది.ఇరు దేశాల మధ్య సంబంధాలను ఉద్దేశిస్తూ "డ్రాగన్, ఏనుగు కలిసి నాట్యం చేస్తున్నాయని" జిన్‌పింగ్ వ్యాఖ్యానించినట్లు పేర్కొంది. దౌత్య సంబంధాలలో స్థిరత్వం కోసం ఇరు దేశాలు పరస్పర సహకారాన్ని విస్తరించుకోవాలని, ఒకరి ఆందోళనలను మరొకరు పరిష్కరించుకోవాలని ఆయన ఆకాంక్షించినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ నివేదించింది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన సరిహద్దు ఘర్షణల తర్వాత సుమారు నాలుగేళ్ల పాటు ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే, 2024 అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, షీ జిన్‌పింగ్ భేటీ కావడంతో పరిస్థితుల్లో మార్పు మొదలైంది. అదే నెలలో సరిహద్దు ప్రతిష్టంభనకు ముగింపు పలకాలని ఇరుపక్షాలు అంగీకరించాయి.గతేడాది జులైలో చైనాలో పర్యటించిన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. సంబంధాల సాధారణీకరణలో సాధించిన సానుకూల పురోగతిని కొనసాగించాలని సూచించారు. ఆ తర్వాత టిబెట్‌లోని కైలాస మానస సరోవరానికి భారత యాత్రికులను తిరిగి అనుమతించడం, వీసా విధానాలను సరళతరం చేయడం, ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులను పునరుద్ధరించడం వంటి చర్యలతో సంబంధాలు మరింత బలపడ్డాయి.కాగా, ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతునున్నాయి. "వందేమాతరం-150 ఏళ్లు" అనే థీమ్‌తో ఈ ఏడాది వేడుకలు నిర్వహిస్తున్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు.

# తెలంగాణలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు



**మొదటిపేజీ తరువాయి** – శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు.అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర సచివాలయంతో పాటు జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లోనూ రిపబ్లిక్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దేశభక్తి వాతావరణం నెలకొంది.

# అమరావతిలో మొదటిసారిగా రిపబ్లిక్ డే వేడుకలు

**మొదటిపేజీ తరువాయి** –

ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. పెరేడ్‌లో పాల్గొన్న 11దళాల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర ప్రగతిని చాటేలా 22శకటాలను ప్రదర్శించారు. వివిధ దళాల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. గణతంత్ర వేడుకలు తిలకించేందుకు రాజధాని రైతులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్దఎత్తున హాజర య్యారు.సవాళ్లను ఎదుర్కొంటూ ప్రభుత్వం ధృఢమైన సంకల్పంతో స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, విశ్వాసాన్ని తిరిగి నిర్మించడానికి కృషి చేస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. నేటి వేడుక చరిత్రాత్మకమన్న ఆయన తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అమరావతిలో జాతీయజెండా ఎగురవేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మన రాష్ట్రం స్పష్టమైన దిశ లేకుండా నిలిచిపోయిందని చెప్పారు. రాజధాని నిర్మాణం ఆగిపోవడంతో ఆర్థిక విశ్వాసం దెబ్బతిందన్నారు. పాలనలో కొనసాగింపుల లేమి పెట్టుబడిదారుల నమ్మకాన్ని తగ్గించి ఆర్థిక స్థిరత్వాన్ని బలహీనపరిచిందని వ్యాఖ్యానించారు.

**పునరుద్ధరణ మార్పు ప్రయాణం:**

రాష్ట్రాన్ని బలపరుస్తూ దాని భవిష్యత్తును సమృద్ధిగా తీర్చిదిద్దుతున్న ప్రతి ఒక్కరితో ఈ శుభక్షణాన్ని పంచుకోవడం గర్వకారణమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలే ప్రగతికి శిల్పులు అని వ్యాఖ్యానించారు. ఈ ప్రయాణం సులభం కాదన్న గవర్నర్, వీటి ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని, సంస్థలు తిరిగి బలపడుతున్నాయని, ప్రజల విశ్వాసం మళ్లీ స్థాపితమవుతోందని చెప్పారు. పునరుద్ధరణ మార్పు ప్రయాణం ప్రారంభమైందన్నారు. ఈ దిశను మరింత స్పష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర-2047 కార్యాచరణను ఒక స్పష్టమైన దృష్టిలో స్థిరపరిచిందని వెల్లడించారు. భారత స్వాతంత్ర్య శతాబ్ది నాటికి, బలమైన, సమగ్ర, ప్రపంచ స్థాయిలో పోటీతత్వం గల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.సవాలు నుంచి మరింత బలంగా ఎదుగుతున్న ఆంధ్రప్రదేశ్: పాలన కాలానుగుణంగా మారాలి అనేది ప్రభుత్వ సిద్ధాంతమని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తెలిపారు. వేగం, పారదర్శకతే ఇప్పుడు సేవల అందింపులో కొత్త ప్రమాణాలు అని చెప్పారు. సాంకేతికత ద్వారా, సహాయం, సమాచారం, న్యాయం పౌరులకు క్షణాల్లో చేరేలా తాము వ్యవస్థను తీర్చిదిద్దుతుని, దీనినే 'వేగవంతమైన పాలన'- స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అని పిలుస్తున్నట్లు వెల్లడించారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా, ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కాదని, ప్రతి సవాలు నుంచి మరింత బలంగా ఎదుగుతున్న ఆంధ్రప్రదేశ్ ఆత్మవిశ్వాసాన్ని కూడా మనం వేడుకగా జరుపుకుంటున్నామని చెప్పారు.గణతంత్రాన్ని తీర్చిదిద్దిన కలలు నేడు కూడా మనకు మార్గదర్శకాలని వివరించారు. ప్రతి పౌరుడికి గౌరవం, అవకాశాలు, న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. కలసికట్టుగా ఆరోగ్య, ఆనంద, సౌభాగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామన్నారు. స్వర్ణ ఆంధ్ర దిశగా ముందుకు సాగుతున్న ఈ ప్రయాణంలో, ప్రతి గ్రామం సుభిక్షంగా, ప్రతి పట్టణం చైతన్యవంతంగా, ప్రతి నగరం సుస్థిరంగా ఎదిగే రాష్ట్రాన్ని మనం నిర్మిద్దామని పిలుపునిచ్చారు.ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఏడాది రిపబ్లిక్ డే రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వకారణమని, చిరకాలం గుర్తుండిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ చారిత్రక సందర్భంపై చంద్రబాబు సోమవారం స్పందిస్తూ.. అమరావతిలో మువ్వన్నెల జెండాను ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ఎజెండాను, భవిష్యత్ కార్యాచరణను గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్పష్టంగా వివరించారని, ఇందుకు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ట్వీట్ చేశారు.గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రాండ్ పరేడ్, అందంగా తీర్చిదిద్దిన శకటాల ప్రదర్శన మన సమష్టి ఆశయాలకు, భవిష్యత్ దృష్టికి అద్దం పట్టాయని చంద్రబాబు ప్రశంసించారు. ఈ వేడుకలను వీక్షించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొంటూ 'జై హింద్' అని తన ప్రకటనను ముగించారు.

# విజయవాడ లోక్ భవన్ లో 'ఎట్ హోం'

**మొదటిపేజీ తరువాయి** – హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాజ్యాంగ అధిపతులు, పరిపాలన, న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖులు ఒకేచోట చేరడంతో ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన అర్ధాంగి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమం ప్రారంభంలో పోలీస్ బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించగా, ఆహూతులందరూ గౌరవ వందనం సమర్పించారు. ఈ వేడుకలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పలువురు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వేదికపై నుంచి కిందకు వచ్చి ఇతర అతిథులతో కలిసిపోయారు. స్వాతంత్ర్య సమరయోధులతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పద్మ పురస్కార గ్రహీతలు, కళాకారులు, క్రీడాకారులతో ఆత్మీయంగా పలకరించారు. నేతల మధ్య సరదా సంభాషణలతో లోక్ భవన్ ప్రాంగణమంతా ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా లోక్ భవన్‌ను విద్యుత్ దీపాల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న అధిపతులంతా ఒకేచోట చేరిన ఈ కార్యక్రమం, రాష్ట్రంలో పరిపాలన సామరస్యాన్ని ప్రతిబింబించింది. గత ఏడాది కాలంలో రాష్ట్రం సాధించిన ప్రగతి, గణతంత్ర స్ఫూర్తి గురించి పలువురు ప్రముఖులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య దాదాపు గంటన్నర పాటు



సాగిన ఈ 'ఎట్ హోమ్' కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

# కలిసికట్టుగా పనిచేస్తే దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా...

**మొదటిపేజీ తరువాయి** –

(లూథరన్ చర్చి) ప్రతిష్టా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి నూతన చర్చిని ప్రారంభించడంతో పాటు, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "దేవుడు మనకు పరీక్షలు పెడతాడు. కానీ, ఆ పరీక్షలను జయించే శక్తిని కూడా ఆయనే మనకు ప్రసాదిస్తాడు. ఎవరూ ఊహించని విధంగా ఈ మందిరాన్ని పునర్నిర్మించుకోవడం గొప్ప విషయం. కష్టాల్లో ఉన్న మన తోటివారిని ఆదుకోవడం, వారికి అండగా నిలవడం మనందరి బాధ్యత" అని ఉద్బోధించారు.ఏడాదిలోపే చర్చి నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న సంకల్పం నెరవేరిందని, పట్టుదలతో పనిచేసిన పునర్నిర్మాణ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. చేయి చేయి కలిపితే ఏదైనా సాధించవచ్చనడానికి ఈ నిర్మాణమే ఒక ఉదాహరణ అని కొనియాడారు. ఈ మందిర నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం దేవుడు తనకు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.ఈ రోజుల్లో చిన్న చిన్న విషయాలకే యువత, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. "పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది చాలా బాధాకరం. దేవుడు పెట్టే పరీక్షలను సంకల్ప బలంతో జయించాలి" అని ఆయన హితవు పలికారు. తన రాజకీయ జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ, "2019లో మంగళగిరిలో పోటీ చేసి ఓటమి పాలయ్యాను. అయినా నేను భయపడలేదు. మరింత కసితో పనిచేసి ప్రజలకు దగ్గరయ్యాను. ఓటమిని ఒక పరీక్షగా స్వీకరించి ముందుకు సాగాను" అని గుర్తుచేశారు. కులాలు, మతాలు వేరైనా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతూ కష్టాలను ఎదుర్కొందామని, దేవుడి ఆశీస్సులతో మంగళగిరిని అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ల చిరంజీవి, ఏఈఎల్సీ అడ్మినిస్ట్రేటర్ పి.యస్ జోసఫ్, రైట్.రెవరెండ్ డాక్టర్ ఎస్.జే బాబూరావు, రెవరెండ్ డాక్టర్ కొడాలి విజయ్, రెవరెండ్ జే.ఏసురత్నం, సంఘ పెద్దలు, పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి అందరితో కలిసి ఫోటోలు దిగారు.

# కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి

**మొదటిపేజీ తరువాయి** –

కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌కు ఉపరాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు స్వాగతం పలికారు. వేదికపైకి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. వెంటనే సైనికులు గౌరవ సూచకంగా శతఘ్నులు పేల్చారు.అనంతరం రోదసీ యాత్ర చేసిన గ్రూప్ కెప్టెన్ శుభాంసు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అశోక్ చక్రను ప్రదానం చేశారు. తర్వాత జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో మొదట కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల కళాకారులు తమ వాద్య పరికరాలతో వన్ ఇండియా స్ఫూర్తిని చాటారు. నాలుగు హెలికాప్టర్లు సభికులపై పూల వర్షం కురిపించాయి.సైన్యంలో వివిధ విభాగాలకు నాయకత్వం వహిస్తున్నసైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి వందనం సమర్పిం చారు. అనంతరం యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనికులు కర్నల్ ఫ్రెడరిక్ సైమన్ నేతృత్వంలో వందనం సమర్పించారు. తర్వాత భారత సైనిక సామర్థ్యాన్ని చాటుతూ జరిగిన పరేడ్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఆశ్విక దళం తర్వాత వివిధ ఆయుధాలను ప్రదర్శించారు. ఇదే సమయంలో మూడు ధ్రువ్ హెలికాప్టర్లు ఆపరేషన్ సిందూర్ జెండాను ప్రదర్శించాయి.ఒక పక్క టీ-90 అర్జున యుద్ధ ట్యాంకులు, టీ-90 భీష్మ యుద్ధ ట్యాంకులు పరేడ్‌లో ప్రదర్శనకు రాగా అదే సమయంలో గగన తలంలో అపాచీ హెలికాప్టర్లు దూసుకెళ్లాయి. బీఎంపీ-3 ఇన్‌ఫాంట్రీ యుద్ధ వాహనం, నాగ్ మిసైల్ వ్యవస్థను ప్రదర్శించారు. అన్ని రకాల ఉపరితలాలపైనా ప్రయాణించే వాహనాలు, మనుషులు లేకుండానే నియంత్రించే యుద్ధ వాహనాలను ప్రదర్శించారు. పైలెట్లు అవసరం లేకుండానే లక్ష్యాలను కచ్చితంగా మానవ రహిత విమానాలైన దివ్యాస్త్ర, శక్తిబా న్‌లు ఆకట్టుకున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ధనుష్, అమోఘ్ గన్ వ్యవస్థలు పరేడ్‌లో పాల్గొన్నాయి. 52 కాలిబర్ ఆర్టిలరీ గన్స్, దేశ రక్షణకే తలమానికమైన బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ, సూర్యాస్త్ర క్షిపణి వ్యవస్థలు ఆకట్టుకున్నాయి. శత్రులక్ష్యాలను ఛేధించడమే కాకుండా ప్రత్యర్థులు ప్రయోగించే ఆయుధాలను నిర్వీర్యం చేసే శక్తి ఉన్న ఆకాశ్ గగనతల రక్షణ వ్యవస్థ, అభ్ర ఆయుధ వ్యవస్థలను పరేడ్‌లో ప్రదర్శించారు. ఉపరి తలం నుంచి గగనతలంలోని లక్ష్యాల కోసం అభివృద్ధి చేసిన మీడియా రేంజ్ మిసైల్ వ్యవస్థ కూడా పరేడ్‌లో పాల్గొంది. భారత సైన్యానికి చెందిన డ్రోన్ శక్తిని ఈగల్ ఆన్ ఆర్మ్ పేరుతో ప్రదర్శిం చారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాలను సమన్వయ పరిచిన ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ నమూనా ఆకట్టు కుంది. అంతకు ముందు గణతంత్ర దినోత్సవం వేళ దేశం కోసం పోరాడిన అమరవీ రులకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పిం చారు. తొలుత దిల్లీలోని వార్ మెమోరియల్ వద్దకు వెళ్లిన ప్రధానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాధిపతులు స్వాగతం పలికారు. తర్వాత వార్ మెమోరియల్ వద్దకు చేరుకున్న ప్రధాని మోదీ పుష్పాంజలి సమర్పి ంచారు. దేశం కోసం పోరాడిన వీరులకు, త్రివిధ దళాల అధిపతులతో కలిసి వందనం చేశారు. తర్వాత అక్కడి పుస్తకంలో తన సందేశం రాశారు.

# అమెరికాలో రేవంత్ రెడ్డి ఎక్కడికెళ్లారు?




**మొదటిపేజీ తరువాయి** – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక విదేశీ పర్యటనలో ఎలాంటి సమాచారం లేకుండా వ్యక్తిగత పర్యటనపై వెళ్లారని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. 'తెలంగాణ ముఖ్యమంత్రి విదేశీ పర్యటనపై తప్పుడు ప్రచారం' అంటూ 'ఎక్స్' వేదికగా వివరణ ఇచ్చింది. ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశపూ ర్వకంగా చేసిన ప్రచారమే అని తెలిపింది.ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం ద్వారా ముఖ్యమంత్రి అధికారికంగా ఆమోదించిన పర్యటనకు సంబంధించిన వాస్తవాలను వక్రీకరించి, ప్రజలను తప్పుదారి పట్టించి గందరగోళం సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం ఇది అని పేర్కొంది. ముఖ్యమంత్రి న్యూయార్క్ పర్యటన పూర్తిగా అధికారికమేనని, అన్ని విధివిధానాలకు అనుగుణంగా సమన్వయంతో నిర్వహించారని పేర్కొంది.ముఖ్యమంత్రి విదేశీ పర్యటనను ముందుగానే అధికారికంగా తెలియజేసి, నిబంధనల ప్రకారమే నిర్వహించారని తెలంగాణ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది. విదేశీ పర్యటనకు అవసరమైన అన్ని అనుమతులను ముందుగానే కేంద్ర ప్రభుత్వం నుంచి పొందినట్లు వెల్లడించింది. దావోస్ నుంచి అమెరికా చేరుకున్న అనంతరం, న్యూయార్క్ విమానాశ్రయంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారని తెలిపింది.న్యూయార్క్‌లో ముఖ్యమంత్రి ప్రయాణానికి ఎంఈఏ అధికారిక వాహనాన్ని ఏర్పాటు చేసిందని, ఇది సాధారణ దౌత్య విధానాల్లో భాగమేనని తెలిపింది. శీతాకాలంలో తీవ్ర మంచు తుపానుల హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో విమాన ప్రయాణం చేయవద్దని ఎంఈఏ ముఖ్యమంత్రిని ఆదేశించిందని, వారి తదుపరి ప్రయాణాన్ని రోడ్డు మార్గంలో చేపట్టాలని తెలిపిందని గుర్తు చేసింది.ఎంఈఏ సూచనల మేరకు, బోస్టన్ వరకు రోడ్డు మార్గంలో ప్రయాణాన్ని ఎంఈఏనే ఏర్పాటు చేసిందని, ఇందులో హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్ వరకు ముఖ్యమంత్రి ప్రయాణం కూడా ఉందని తెలిపింది. ఉన్నతస్థాయి విద్యా సంస్థ నిర్దేశించిన కార్యక్రమాలపై పూర్తిగా దృష్టి సారించాల్సిన అవసరం ఉండటంతో, ఈ కాలంలో ఉద్దేశ్య పూర్వకంగానే ముఖ్యమంత్రి తన కార్యక్రమాలను నిరాడంబరంగా ఉంచినట్లు ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది.సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమైనవి, బాధ్యతారహితమైనవి, అలాగే ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రమేనని పేర్కొంది. దయచేసి ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. అధికారులు చేసే ప్రకటనలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సూచించింది.

# 'ప్రెస్' స్టిక్కర్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం




**మొదటిపేజీ తరువాయి** – వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్‌ను ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.క్షేత్రస్థాయిలో కొందరు కేవలం యూట్యూబ్ ఛానెళ్లు లేదా ఇతర ప్రైవేటు సంస్థల ఐడీ కార్డులను చూపిస్తూ వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్లను విరివిగా వాడుతున్నారని, దీనివల్ల అసలైన జర్నలిస్టుల ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. సెంట్రల్ మోటార్ వెహికల్ చట్టం-1989 ప్రకారం వాహనాలపై లేదా నంబర్ ప్లేట్లపై అనధికారికంగా 'ప్రెస్', 'పోలీస్', 'గవర్నమెంట్' వంటి పదాలను వాడటం చట్టరీత్యా నేరం.ఈ కొత్త నిబంధనలను అతిక్రమించి అక్రిడిటేషన్ లేకుండా 'ప్రెస్' స్టిక్కర్లను వాడితే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. అలాంటి వ్యక్తులకు భారీ జరిమానాతో పాటు అవసరమైతే వాహనాన్ని సీజ్ చేసే అధికారం కూడా రవాణా శాఖకు ఉందని అధికారులు హెచ్చరించారు. అక్రిడిటేషన్ లేని వారు తమ వాహనాలపై ఉన్న స్టిక్కర్లను వెంటనే తొలగించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో పోలీస్ మరియు రవాణా శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.ఈ నిర్ణయంతో టోల్ ప్లాజాలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నకిలీ జర్నలిస్టుల వల్ల తలెత్తుతున్న గందరగోళానికి తెరపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, అక్రిడిటేషన్ లేని నిజమైన ఫీల్డ్ రిపోర్టర్లకు ఇది కొంత ఇబ్బంది కలిగించే అవకాశమున్నప్పటికీ, జర్నలిజం వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు ఈ చర్య అవసరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు.

# భారత రాజ్యాంగం ఎంతో గొప్పది

**రాజ్యాంగం స్వేచ్ఛ సమానత్వం కల్పించింది**

**ప్రతి ఒక్కరు హక్కులతో పాటు బాధ్యతలు కలిగి ఉండాలి**

**జగిత్యాల జనవరి 26 (ప్రజామంటలు) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్ల ప్రతి పౌరుడికి సమానత్వం స్వేచ్ఛ న్యాయం అందించిందని జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుఎల్లాల రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం తహసిల్ చౌరస్తాలో గల జగిత్యాల ప్రెస్ క్లబ్ ( టి యు డబ్ల్యు జే ఐజేయు) లో జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన రాజ్యాంగ విలువలు పాటించాలి అన్నారు. మనకు రాజ్యాంగం హక్కులతో పాటు కర్తవ్యాలను కూడా నేర్పిస్తుంది అన్నారు1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని ఆ రోజు నుంచి ప్రజాస్వామ్య దేశంగా అవతరించిందన్నారు. రాజ్యాంగ హక్కులతోనే బాధ్యతలు



నిర్వహించడంతో దేశంలో అభివృద్ధితోపాటు, స్వేచ్ఛతో జీవిస్తున్నా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే ఐ జే యు జిల్లా అధ్యక్షులు చీటీ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి, , అనుబంధ సంఘ సభ్యులు టీవీ సూర్యం, ఆదిల్ , సీనియర్ పాత్రికేయులు ముక్క వేణుగోపాల్, పురుషోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుకూరి శశిధర్, ఉపాధ్యక్షులు ముసిపట్ల దేవేందర్, బద్దెనపల్లి మల్లేశం శనిగరపు శ్రీనివాస్, కోశాధికారి బోయినపల్లి శ్రీధర్ రావు, సంయుక్త కార్యదర్శి గాజుల మహేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కడర్ల రంజిత్ కుమార్, కార్యవర్గ సభ్యులు నీరటి గంగాధర్, కల్లెడ హరీష్ , సామ మహేష్, వాసం రఘు కుమార్, మహమ్మద్ సాబీర్ అలీ, కటుకూరు సంతోష్ కుమార్, దిండిగాల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షులు హైదర్ అలీ, సంయుక్త కార్యదర్శి గుర్రం చంద్రశేఖర్ చింత నరేష్,, కార్యవర్గ సభ్యులు తాండ్ర శంకర్ గౌడ్ మనోజ్ నరేష్ శ్రీకాంత్ జర్నలిస్టులు ప్రదీప్, జిల్లా సత్యం, లక్ష్మారెడ్డి, హనుమంతు పటేల్ ప్రవీణ్ ఫజల్ సిరిసిల్ల రాజేందర్ శర్మ, మోసిక్, ఈక్రముద్దీన్, రమేష్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిన గొప్ప పత్రం భారత రాజ్యాంగం

**టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస రావు**

**జగిత్యాల జనవరి (26 ప్రజామంటలు) :** జిల్లా కార్యాలయంలో ఘనంగా గణ తంత్ర దినోత్సవ వేడుకలు ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిన గొప్ప పత్రం భారత రాజ్యాంగం అని టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస రావు అన్నారు. 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో గల టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి, స్వీట్లు పంపిణీ చేసి గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మనం 1947 ఆగస్టు 15న బ్రిటీష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందినప్పటికీ, మనకంటూ ఒక సొంత చట్టం, ఒక రాజ్యాంగం ఏర్పడింది మాత్రం



1950 జనవరి 26న అన్నారు. ఆ రోజునే మన దేశం పూర్తిస్థాయి గణతంత్ర రాజ్యంగా అవతరించిందని తెలిపారు. అందుకే ప్రతి ఏటా ఈ రోజును మనం ఎంతో గర్వంగా జరుపుకుంటాం అని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాత్రికేయులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి, ఆదిల్, జిల్లా ఉపాధ్యక్షులు హైదర్ అలీ, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శులు గుర్రం చంద్ర శేఖర్, చింత నరేష్, కార్యవర్గ సభ్యులు మనోజ్, నరేష్, శ్రీకాంత్, తాండ్ర శంకర్ గౌడ్, జగిత్యాల పట్టణ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎల్లాల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్, ఉపాధ్యక్షులు ముసిపట్ల దేవేందర్, బద్దెనపల్లి మల్లేశం, శనిగరపు శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు వేణుగోపాల్, అంజయ్య, స్వామి, లక్ష్మారెడ్డి, ఆనంద్, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి



**ఎల్కతుర్తి జనవరి 26 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పులి రమేష్, ఎస్సై అక్కినపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఈరోజు మనం ఎంతో గర్వంగా గౌరవంగా జరుపుకుంటున్న 77 వ గణతంత్ర జెండా ఆవిష్కరణ కార్యక్రమం మన దేశ స్వతంత్రానికి రాజ్యాంగ విలువలకు ప్రత్యేక పథకం మనకు త్యాగం ధైర్యం కర్తవ్య నిబంధన గుర్తుచేస్తుంది దేశ స్వతంత్ర కోసం ఎందరో మహానుభావులు తన ప్రాణాలను అర్పించారు వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాము వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మన ముఖ్యంగా పోలీస్ విభాగానికి అది మరింత గొప్ప బాధ్యత పోలీస్ అనేది కేవలం చట్టం అమలు చేసే శాఖ మాత్రమే కాదు ప్రజల రక్షణే మా ధ్యేయం న్యాయమే మా లక్ష్యం సేవే మా స్వభావం ప్రజలలో నమ్మకం పెంపొందిస్తూ చట్ట పరిరక్షణ నిష్పక్షపాతంగా నిజాయితీగా పని చేయాల్సిన బాధ్యత మాపై ఉంది సమాజంలో శాంతిభద్రతలు మన సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు వారి సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందిస్తున్నారు మనకు ఒక సంకల్పాన్ని గుర్తుచేస్తుంది మన వీధుల్లో మరింత నిబద్ధతతో ప్రజలకు మరింత దగ్గరగా దేశానికి గర్వకారణంగా పనిచేయాలని ఈ సందర్భంగా సీఐ అన్నారు . ఈ కార్యక్రమానికి హాజరైన మీడియా మిత్రులు మరియు నా ప్రియమైన పోలీస్ కుటుంబ సభ్యులారా అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు మన దేశంలో ఎప్పుడు శాంతియుతంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటూ జై హింద్ జై భారత్.

**ఎల్కతుర్తి మండలము తాసిల్దార్ కార్యాలయం భవన నిర్మాణం కొరకు..3 కోట్ల.25 లక్షలు మంజూరు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ద్వారా పరిపాలన విభాగం అనుమతులతో ఎల్కతుర్తి అభివృద్ధిలో అగ్రభాగం రాష్ట్రంలో ప్రత్యేక మైనది మన ఎల్కతుర్తి అభివృద్ధి కొరకు అభివృద్ధి ప్రదాత సంక్షేమ సారధి పొన్నం ప్రభాకర్ అన్న ప్రత్యేక కృషి ద్వారా నూతన తాసిల్దార్ భవనము తెలంగాణ రాష్ట్రంలోనే అత్యున్నతంగా ప్రజల సేవకై అధికారుల అన్ని విభాగాల అధికారులకు విధులకు సౌలభ్యం కొరకు ప్రజలకు అవసరాలకు అనుగుణంగా ప్రజా పాలన ప్రజా సంక్షేమం కొరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేకత ఎల్కతుర్తి అభివృద్ధి ప్రదాత మన పొన్నం ప్రభాకర్ అన్న కి హార్ధిక కృతజ్ఞతలు. ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన వారు మాటూరి.ప్రమోద్. పంగ బన్నీ.. శనిగరం అభిషేక్... అంబాల బబ్బులు... దోమ అరవింద్.. జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శనిగరపు వెంకటేష్ గారి ఆధ్వర్యంలో క్యాంప్ ఆఫీసులో మినిస్టర్ పొన్నం ప్రభాకర్ అన్న కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.

# జగిత్యాల పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండా పతాకావిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల జనవరి 26 ( ప్రజా మంటలు) :** విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 125 మంది ఉద్యోగులకు ప్రశంస పత్రాలు ప్రదానం జగిత్యాల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా, రాష్ట్ర శోభ సంతరించుకుని నిర్వహించబడ్డాయి. జాతీయ గీతాలాపనతో, సైనిక బ్యాండ్‌ల మధ్య జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, ఎన్సిసి పరేడ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ పౌరులకు సమాన హక్కులు, బాధ్యతలు కల్పిస్తుందని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం గురించి క్షుణ్ణంగా వివరించారు. జిల్లాలో వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, పౌరసేవలు, సంక్షేమ పథకాలు మరియు ఇతర విభాగాల్లో సాధించిన పురోగతి పై ఆయన విభాగాల వారీగా ఉపన్యాసించారు. వ్యవసాయ రంగంలో రైతులకు మద్దతు ధరలు, పంట బీమా, సన్న రకం వడ్లకు బోనస్, రైతు సేవా కేంద్రాలు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఖరీఫ్‌రబీ సీజన్లలో పంటల విస్తీర్ణం పెరిగినట్టు వివరించారు. మార్కెట్ యార్డుల్లో ఎం ఎస్ పి చెల్లింపులు పారదర్శకంగా జరిగాయని పేర్కొన్నారు. ఆరోగ్యరంగంలో జిల్లాలో పి హెచ్ సి, సి హెచ్ సి, మాతృశిశు ఆరోగ్యం, అంగన్వాడీ సేవలు సమర్థవంతంగా సాగుతున్నాయని



తెలిపారు. విద్యా రంగంలో పాఠశాలల మౌలిక సదుపాయాల పెంపు, డిజిటల్ బోధన, లైబ్రరీలు మరియు లాబ్‌ల ఏర్పాటుతో విద్యార్థుల అకాడమిక్ వాతావరణం మెరుగుపడినట్టు వివరించారు. బాలికల విద్య ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, సి సిరోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్, త్రాగునీటి సరఫరా వంటి పౌరసేవలు అమలు అవుతున్నాయని తెలియజేశారు. పట్టణాభివృద్ధిలో రోడ్లు, స్వచ్ఛ భారత్ కార్యక్రమం, ట్యాంకుల పునరుద్ధరణ, పారిశుద్ధ్య చర్యలు అమలు అవుతున్నాయని వివరించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన వివిధ ఆయా శాఖల ఉద్యోగులకు ప్రశంస పత్రాలు మరియు బహుమతులు అందజేశారు. “ప్రతి ఉద్యోగి విధి నిర్వహణ అంటే పవిత్ర బాధ్యత. ప్రజా సేవ అంటే నమ్మకం నిలబెట్టడం“ అంటూ పేర్కొన్నారు. ఉద్యోగులు మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించి అభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలన్నారు. పోలీస్, రెవెన్యూ, విద్య, ఆరోగ్య, మెప్మా, గ్రామపంచాయితీలు, డి ఆర్ డి ఏ, ఐ సి డి ఎస్ మరియు ఇతర శాఖలు అవార్డులు అందుకున్నాయి.

**ప్రభుత్వ శాఖల స్టాళ్లు ప్రధాన ఆకర్షణ**

వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా, పిల్లల దివ్యాంగుల వయోవృద్ధుల మరియు ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా ), తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, ఎస్సీ, ఎస్టీ, బి. సి మైనార్టీ సంక్షేమ శాఖ, జగిత్యాల జిల్లా పోలీస్ మరియు వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రజల దృష్టిని ఆకర్షించాయి. సంక్షేమ, ఆరోగ్యం, పింఛన్లు, వ్యవసాయం, విద్య, పౌరసరఫరాల పథకాల అమలు వివరాలు, గణాంకాలు, ఫోటో డాక్యుమెంట్స్ ప్రదర్శించబడగా జిల్లా కలెక్టర్ స్టాళ్లను సందర్శించి శాఖల వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు. ఈ వేడుకలకు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులుమరియు ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, ఆర్డీవో మధు సూదన్, కలెక్టరేట్ ఏ.వో షాదబ్ హకీమ్ జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, సమబంధిత కార్యాలయాల సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**జగిత్యాల జనవరి 26 (ప్రజా మంటలు) :** 77 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మరియు కార్యాలయ అధికారులకు సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ....ఎందరో త్యాగధనుల ఫలితం మే గణతంత్ర దినోత్సవం అని వారిని ఎప్పుడూ మనం స్మరిస్తూ ఉండాలి అని వారి త్యాగఫలం ద్వారా మనం ఈరోజు ఎంత స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవిస్తున్నామని తెలిపినారు. మనకు స్వాతంత్రం వచ్చిన తరువాత సమాజంలో ఏ విలువలకు కట్టుబడి ఉండాలి అనేది రాజ్యాంగంలో రూపొందించబడింది తెలిపారు. స్వేచ్ఛ ,సమానత్వం ,సౌభ్రాతృత్వం అనే విలువలతో మన రాజ్యాంగం రూపొందించబడింది అని ఈ యొక్క రాజ్యాంగానికి కట్టుబడి ప్రతి ఒక్క చట్టం అమలు చేయబడుతుంది అని తెలిపారు. ఈ చట్టాలను అమలు చేసే బాధ్యత అందరికంటే ముందుగా పోలీసు డిపార్ట్మెంట్ పై ఉందని కాబట్టి ఈ యొక్క విలువలను మరొకసారి గుర్తు చేసుకుంటూ ఈ యొక్క విలువలకు కట్టుబడి చట్టాలను అమలు చేస్తామని, జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పోలీస్ స్టాల్ ప్రదర్శన.**

గణతంత్ర దినోత్సవ సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ లో పోలీస్ శాఖ వారిచే ఏర్పాటు చేయబడిన స్టాల్, డాగ్ స్క్వాడ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ యొక్క స్టాల్ లో పోలీస్ వ్యవస్థ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఉపయోగించే అధునాతన సాధనాలు, పోలీస్ శాఖ అవలంబిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ క్రైమ్, షీ టీమ్స్, ఫింగర్ ప్రింట్, కమ్యూనికేషన్, బాబ్ డిస్పోసల్ టీమ్, ఆయుధాల గ్యాలరీ, డాగ్ స్క్వాడ్ , మొదలగు వాటి పై సవివరంగా తెలియజేసేందుకు ఏర్పాటుచేసిన స్టాల్స్ ల ప్రదర్శన అందరిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ , ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్ ,కిరణ్ కుమార్,సుధాకర్,శ్రీధర్ ,కరుణాకర్ ఆర్.ఎస్.ఐ లు హెడ్ క్వార్టర్ సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

**టి ఆర్ ఆర్ ఎస్ నాయకులను అభినందన**

**సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేష్, సబ్ ఇన్స్పెక్టర్ అక్కినపల్లి ప్రవీణ్ కుమార్**

**ఎల్కతుర్తి జనవరి 26 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో మరియు ఎస్సై పోలీస్ స్టేషన్ లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సీఐ పులి రమేష్ మరియు ఎస్ఐ అక్కినపల్లి ప్రవీణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి కండువా కప్పి సన్మానం చేసిన తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ సోమవారం రైతు రక్షణ సమితి నాయకులతో కలిసి ఆయన ఆఫీసులో రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 2026 క్యాలెండర్ను పులి రమేష్ ఎస్సై అక్కినపల్లి ప్రవీణ్ కుమార్ చేతుల



మీదుగా తెలంగాణ రైతు రక్షణ సమితి క్యాలెండర్లను ఆవిష్కరించారు. సీఐ, ఎస్ఐ, మాట్లాడుతూ, రైతుల సమస్యల పరిష్కారానికి విశేషంగా తమ వంతు కృషి చేస్తున్న తెలంగాణ రైతు



రక్షణ సమితి నాయకులను సిఐ,ఎస్ఐ అభినందించారు. రైతుల పట్ల ఏమైనా సమస్యలు ఉంటే మాకు తెలియజేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులతో వినయపూర్వకంగా ముచ్చటించి భాస్కర్ కోరారు. ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షులు హింగే రవీందర్, అంబీర్ శ్రీనివాస్, కందుకూరి రాజన్న, శ్రీరామోజు సతీష్ చారి, నల్ల రాజిరెడ్డి, ఆర్టీసీ డ్రైవర్ గూడెల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

## జింఖానా గ్రౌండ్‌లో ప్రధానమంత్రి ఖేలో ఇండియా క్రికెట్ పోటీలు



**సికింద్రాబాద్, జనవరి 25 ( ప్రజామంటలు) :** ప్రధానమంత్రి ఖేలో ఇండియా పోటీల్లో భాగంగా ఆదివారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో సనత్‌నగర్ టైగర్స్, గోల్డెన్ టైమ్స్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో సనత్‌నగర్ టైగర్స్ జట్టు ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గోల్డెన్ టైమ్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. 113 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సనత్‌నగర్ టైగర్స్ జట్టు 9.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటింగ్‌లో 22 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో రెండు వికెట్లు సాధించిన ఈనాడు సతీష్‌కు ‘మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది. విజేత జట్టుకు సిటీ మీడియా కన్వీనర్ ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్ బహుమతులు అందజేశారు.

# జగిత్యాల బిఆర్ఎస్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం.. పార్టీలో భారీ చేరికలు



**జగిత్యాల, జనవరి 26 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలదండ వేసి నివాళులు అర్పించారు. అదే కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు చోటు చేసుకున్నాయి. జగిత్యాల పట్టణం 43వ వార్డుకు చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి విజయ్ కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్‌లో చేరారు. అలాగే జగిత్యాల పట్టణం 12వ వార్డుకు చెందిన పంతం అనురాధ ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలో చేరారు. ఇదే విధంగా జగిత్యాల పట్టణం 33వ వార్డుకు చెందిన కుక్కల శ్రీకాంత్ బీజేపీని విడిచి బిఆర్ఎస్‌లో చేరారు. చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి అధికారికంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన తాసిల్దార్ మజీద్ మమ్మద్ అబ్దుల్**



**గొల్లపల్లి జనవరి 26 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం తో పాటు మండల పరిధి లోనీ పంచాయితీ ప్రభుత్వ కార్యాలయాల్లో పాటు కుల సంఘాలు యువజన సంఘాలు గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ ఈ సందర్భంగా తాసిల్దార్ మాజిద్ మహమ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ “భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మన దేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎదిగేందుకు పునాది వేసిన రాజ్యాంగ నిర్మాతలకు ఈ సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం అని అన్నారు ఈ కార్యక్రమంలో సంబంధిత మండల అధికారులు సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ప్రధాన ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది వార్డు సభ్యులు ప్రజా ప్రతి నిధులు కుల సంఘాల నాయకులు యువకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెరాస పార్టీ విడి కాంగ్రెస్ పార్టీ చేరిక



**చుక్క భీమరాజ్ ,సంధ్యారాణి**

**గొల్లపల్లి జనవరి 26 ప్రజా మంటలు :** ధర్మపురి పట్టణానికి చెందిన తెరాస పార్టీ నాయకులు చుక్క భీమరాజ్, సంధ్యారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ క్యాంప్ ఆఫీసులో వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఘనంగా రిపబ్లిక్ డే



**సికింద్రాబాద్ జనవరి 26 (ప్రజా మంటలు) :** బోలక్పూర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో 77వ రిపబ్లిక్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. చిన్నారులు దేశభక్తిని చాటుతూ గాంధీ నెహ్రూ సుభాష్ చంద్రబోస్ ఇందిరాగాంధీ అంబేద్కర్ అల్లూరి సీతారామరాజు తదితర దేశ నాయకుల వేషధారణలతో అలరించారు. చిన్నారులు గేయాలు నృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల కరాటే ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల వరలక్ష్మి మాట్లాడుతూ... నాటి దేశ నాయకుల స్ఫూర్తిని నేటి తరం పిల్లలు, యువకులు అలవర్చుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కరస్పాండెంట్ డాక్టర్ శ్రీనివాసులు మంచాల,టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం




**సికింద్రాబాద్, జనవరి 26 (ప్రజా మంటలు) :** పద్మారావు నగర్ లోని పల్స్ హాస్పిటల్ లో సోమవారం 77 వ రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీనియర్ డాక్టర్ బట్టు ఆసుపత్రి వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. పేదలకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. బ్లడ్ ప్రెషర్, దయాబెటిక్ ( జి ఆర్ బి ఎస్) తదితర వైద్య పరీక్షలను ఉచితంగా చేయడంతో పాటు ఒకరోజు కన్సల్టెన్సీ ఫీజు తీసుకోకుండా రోగులకు ఉచితంగా వైద్య సేవలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్ బట్టును అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ బట్టు, బిజెపి సీనియర్ నాయకులు ఎక్కాల శ్రీనివాస్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కలెక్టర్ సత్య ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంస పత్రం**

**అందుకున్న ఎంపీడీవో నీలగిరి రవీందర్ రావు**



**గొల్లపల్లి జనవరి 26 ప్రజా మంటలు :** గొల్లపెల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా విధులు నిర్వహిస్తున్న, నీలగిరి రవీందర్ రావు కు సేవలను గుర్తించి జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ చేతుల మీదుగా జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రం పొందడం జరిగింది.

# ముందస్తు ఎన్నికల ప్రచారా నీ సిద్ధమైన రథం

**కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**గొల్లపల్లి జనవరి 26 ప్రజా మంటలు :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఇప్పటికే ఒక అడుగు ముందున్న మంత్రి లక్ష్మణ్ కుమార్ మున్సిపల్ నోటిఫికేషన్ కు ముందే ప్రచార ఏర్పాట్లను సైతం చేసుకుంటున్నారు. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్ట్ పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయడానికి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలో పరిధిలో సుడిగాలి పర్యటన నిర్వహిస్తూ పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ప్రచారం ప్రారంభించడానికి మంత్రి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా ఎన్నికల ప్రచారం కకోసం ప్రత్యేక ప్రచార రథాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం కొండగట్టులో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజంగి నందయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మంటలు

మంగళవారం 27 - 01 - 2026

# సర్కారు బడులు నింపేలా ముందడుగు

**ఫిబ్రవరి 1 నుంచి ఇంటింటికీ టీచర్లు**

**విద్యార్థులను సర్కారు బడులకు తీసుకొచ్చేందుకు గురువుల సంకల్పం**

**'ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం' పేరిట కార్యక్రమం**



విశాలమైన తరగతి గదులు. ఆకట్టుకునే ఆట స్థలాలు. అపార అనుభవం, అంకితభావం కలిగిన గురువులు.! వీటన్నింటికీ మించి పైసా ఖర్చు లేకుండానే దొరికే ఉత్తమ విద్య. ఇవీ రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల ప్రత్యేకతలు.! రాష్ట్రాన్ని ఏలుతున్న రాజకీయ నాయకుల నుంచి ఐఏఎస్‌ల వరకు చాలా మంది ఇక్కడ చదువుకున్నవారే.! ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన బడులు గత వైఎస్సార్సీపీ పాలకుల అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతున్నాయి. దీంతో ప్రైవేటు స్కూల్స్ బాట పట్టిన పిల్లలను తిరిగి సర్కారు బడులకు తీసుకొచ్చేందుకు గురువులు నడుం బిగించారు. ఓ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.ఐదేళ్లు అనేక రంగాలను నాశనం చేసిన వైఎస్సార్సీపీ సర్కార్ పిల్లల జీవితాలతోనూ ఆడుకుంది. టీచర్లకు సరైన శిక్షణ ఇవ్వకుండానే అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. 5 ఏళ్లలో కనీసం ఒక్క ఉపాధ్యాయ పోస్టును సైతం భర్తీ చేయలేదు. నిరంకుశంగా బడుల వీలినం చేపట్టింది.దీంతో వైఎస్సార్సీపీ హయాంలో పిల్లలు కొంతమంది ప్రైవేటు వైపు మళ్లగా మరికొందరు స్తోమత లేక బడి మానేశారు. కూటమి సర్కార్ రాగానే సమస్యలను చాలా వరకు చక్కదిద్దింది. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేసింది. ప్రాథమికోన్నత, హైస్కూల్ ప్లస్ విధానాలు రద్దు చేసింది. అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇప్పుడు విద్యార్థులను ప్రభుత్వ బడులకు తిరిగి తీసుకొచ్చేందుకు గురువులు నడుం బిగించారు. "ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం" నినాదంతో ఓ కార్యక్రమం చేపట్టాలని సంకల్పించారు."మొత్తం పాఠశాలలు అన్నింటిని సర్వంగ సుదరంగా తీర్చిదిద్దారు. స్కూల్లో మధ్యాహ్న భోజనం అద్భుతంగా ఉంది. పిల్లలకు అవసరమైన పుస్తకాలు, షూస్ మొదలైనవి విద్యార్థులకు అందిస్తున్నారు. ఈరోజు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వాళ్లల్లో 90 శాతం మంది గవర్నమెంట్ స్కూల్‌లో చదివిన వాళ్లమే. కావున ప్రభుత్వ బడిని బలోపేతం చేసేందుకు మేం కచ్చితంగా కృషి చేస్తాం. పాఠశాలకు అదనంగా గంట సమయం కేటాయిస్తాం. పిల్లలకు నైతిక విద్య నేర్పుతాం. ప్రస్తుత రోజుల్లో గంజాయికి అలవాటు పడుతున్నా పిల్లలు ఉన్నారు. బాధ్యతయుతా పౌరులుగా వారిని తీర్చిదిద్దుతాం. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నాం." - ఎన్.వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ అధ్యక్షుడుఫిబ్రవరి 1 నుంచి నెలాఖరు వరకు లక్షా 85 వేల మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రోజూ విధుల్లో పాల్గొంటూనే, విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే ఉదయం సాయంత్రం వేళల్లో ఇంటింటి ప్రచారం చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఓ పోస్టర్‌ను రూపొందించి దాని ద్వారా ప్రభుత్వ బడుల గొప్పతనాన్ని తల్లిదండ్రులకు వివరించనున్నారు. ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్చాలని కోరనున్నారు. ముందుకొచ్చే ప్రజాప్రతినిధులు, సమాజ సేవకులను కలుపుకుని ప్రచారం చేయనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు తెలిపారు. గురువులు చేపట్టిన ఈ సంకల్పానికి ప్రభుత్వం కూడా అన్ని విధాల సహకారం అందిస్తూ, వారిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుటుంది. "అవసరమైతే మనమే ఒక గంట అదనంగా పనిచేద్దాం. మన దగ్గర చదివే పిల్లలకు చదవడం, రాయడం, మాట్లాడడం, తెలుగుతో పాటు ఆంగ్లం భాషలోనూ మాట్లాడే సామర్థ్యం ఉంది. ఉపాధ్యాయులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. ఒక అంశంపై విద్యార్థులకు అవగాహన రావాలి అంటే ఉపాధ్యాయుడు వివరించి బోధించాలి. ఆ పని కేవలం ప్రభుత్వ పాఠశాల్లలో మాత్రమే జరుగుతుంది. మిగతా స్కూల్లో కేవలం ఎగ్జామ్స్ కోసమే బోధనా జరుగుతుంది.'

# ఆదమరిస్తే ఫోన్ పోయినట్లే

**నగరంలో పెరుగుతున్న సెల్‌ఫోన్ చోరీలు**

**చెలరేగిపోతున్న సెల్‌ఫోన్ చోరీ ముఠాలు**

**రద్దీ ప్రాంతాల్లో చాకచక్యంగా ఫోన్లు కొట్టేస్తున్న కేటుగాళ్లు**

**బస్టాండ్లు, రైతు బజార్లు, మార్కెట్లు, రైల్వేస్టేషన్లలో చేతివాటం**

**బాధితులకు తిరిగి సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న పోలీసులు**



స్మార్ట్‌ఫోన్ మనకో మంత్రదండం. అన్నింటికీ బ్రహ్మాస్త్రం. ఏ పని చేయాలన్నా ఫోన్ లేనిదే రోజు గడవదు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఫోన్‌లే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. బస్టాండ్లు, రైతు బజార్లు, రైల్వేస్టేషన్లలో కేటుగాళ్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏ మాత్రం అనుమానం రాకుండా పని పూర్తి చేసుకుని ఉడాయిస్తున్నారు. మరి ఇలాంటి కేటుగాళ్లకు పోలీసులు ఎలా చెక్ పెడుతున్నారు? మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?

**ప్రతిరోజూ 10 నుంచి 15 కేసులు :** సెల్‌ఫోన్ చేతిలో ఉంటే సమస్తం మన దగ్గర ఉన్నట్లే. ఎటువంటి సమాచారం అయినా క్షణాల్లో తెలుసుకోవచ్చు. ప్రధానంగా ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలు సులభంగా చేసుకోవచ్చు. నగదు చెల్లింపుల దగ్గర నుంచి ప్రతి ఒక్కటీ ఫోన్ ద్వారానే జరిగిపోతున్నాయి. మరి అటువంటి సెల్‌ఫోన్ చోరీకి గురైతే కోలుకోలేని దెబ్బే. నగరమేదైనా ప్రస్తుతం సెల్‌ఫోన్ల చోరీ సాధారణంగా మారిపోయింది. ప్రతిరోజూ ఒక్కో ఠాణా పరిధిలో 10 నుంచి 15 ఫోన్లు దొంగతనానికి గురవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు."అందరి దగ్గర డబ్బులు, పర్సులు ఉంటాయో లేదో తెలీదు కానీ సెల్‌ఫోన్లు మాత్రం కచ్చితంగా ఉంటాయి. ఒక్క ఫోన్ దొంగతనం చేసినా రూ.2 వేల అయితే వస్తాయి. అందుకే విపరీతంగా దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసులు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో ఈ చోరీలు జరుగుతున్నాయి. రద్దీ ఉన్న ప్రదేశాల్లో ఒకరిని ఒకరు తోసుకుంటూ చాలా తేలికగా దొంగతనాలు చేస్తున్నారు.

**రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధికంగా :** ప్రధానంగా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను కొందరు కేటుగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుని చోరీలకు తెగబడుతున్నారు. ఎక్కువగా అంతర్రాష్ట్ర ముఠాలు చరవాణులు అపహరిస్తున్నట్టు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. నలుగురు నుంచి ఆరుగురు ముఠాగా ఏర్పడి రద్దీ ఉండే బస్టాండ్లను ఎంచుకుని చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తేల్చారు. బస్సులు ఎక్కే, దిగే క్రమంలో తాపీగా పని పూర్తి చేస్తున్నారు.

**ఈ ప్రదేశాల్లో ఎక్కువగా :** ముఠా సభ్యులందరూ ప్రాంతాల వారీగా ప్రయాణిస్తూ సెల్‌ఫోన్లు అపహరిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ చోరీ ముఠాలు రెచ్చిపోతున్నాయి. అదును చూసి ఫోన్లను దొంగిలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో దొంగిలించిన ఫోన్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు కొల్లగొడుతున్నారు. బాధితులు తమ బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేసేలోపు కేటుగాళ్లు సొమ్ము స్వాహా చేస్తున్నారు. దీంతో బాధితుల జేబులు గుల్లవుతున్నాయి."దొంగతనం చేసిన ఫోన్లను కొనడం, అమ్మడం రెండూ నేరాలుగా పరిగణిస్తాం. సరైన బిల్లు లేకుండా సెల్‌ఫోన్ కొనకూడదు. ఇటువంటి పనులు చేసి దొరికిన వారిని కఠినంగా శిక్షిస్తాం." - గుణశేఖర్, మల్కాజిగిరి నేర విభాగం డీసీపీ

**బిల్లు లేకుండా సెల్‌ఫోన్లు కొనవద్దు :** జేబులో ఉండే ఫోన్ పోయిందని గుర్తించిన సదరు యజమాని పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఫోన్‌కు సంబంధించిన బిల్లు, ఎక్కడ కొన్నారు వంటి రసీదులన్నీ ఫిర్యాదుదారుడు పోలీసులకు సమర్పించాల్సి ఉంటుంది. బిల్లు లేకుండా సెల్‌ఫోన్లు కొనవద్దని పోలీసులు సూచిస్తున్నారు. సెల్‌ఫోన్ చోరీకి గురైన సందర్భాల్లో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల వల్ల చాలాసార్లు ఉపయోగం ఉంటోంది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చోరీ అయిన ఫోన్లను గుర్తిస్తున్న పోలీసులు, తిరిగి బాధితులకు అప్పగిస్తున్నారు. సెల్‌ఫోన్ల అపహరణను అరికట్టాలంటున్న బాధితులు ఈ తరహా ముఠాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. సెల్‌ఫోన్లు అపహరించే ముఠాలను పట్టుకోవడానికి పోలీసులు మరిన్ని పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# కర్తవ్యపథ్‌లో ప్రత్యేక ఆకర్షణగా 'ఆపరేషన్ సిందూర్' శకటం

**పరేడ్‌లో ప్రదర్శించిన సైన్యం**

**గణతంత్ర వేడుకల్లో ఆపరేషన్ సిందూర్ శకటం ప్రదర్శన**

**పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత్ జరిపిన మెగా ఆపరేషన్ అది**

**త్రివిధ దళాల సంయుక్త పోరాట పటిమకు ప్రతీకగా శకటం**

**పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈ ఆపరేషన్**




77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన పరేడ్‌లో త్రివిధ దళాల శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన భారీ సైనిక చర్య 'ఆపరేషన్ సిందూర్'ను ఈ శకటం ద్వారా ప్రదర్శించారు. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేనల సంయుక్త పోరాట శక్తికి, ఐక్యతకు ఇది ప్రతీకగా నిలిచింది.'సంయుక్త పోరాటంతో విజయం' అనే థీమ్‌తో ఈ శకటాన్ని రూపొందించారు. యుద్ధ సమయంలో ప్రణాళిక, సమన్వయంతో నిర్ణయాత్మక చర్యలు తీసుకునే భారత సంకల్పాన్ని ఇది చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత వాయుసేన జరిపిన వైమానిక దాడులు, సముద్రంలో ఆధిపత్యాన్ని నిలబెట్టిన నౌకాదళం వేగవంతమైన విన్యాసాలు, సైన్యం సాగించిన భూతల దాడులను శకటంలో కళ్లకు కట్టినట్లు చూపించారు.గతేడాది పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టారు. మే 7న తెల్లవారుజామున పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై దాడులతో ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు సాగిన ఈ సైనిక చర్యలో పాకిస్థాన్.. భారత నగరాలపై క్షిపణి దాడులకు విఫలయత్నం చేయగా, వాటిని భారత వాయు రక్షణ వ్యవస్థ సమర్థంగా నిర్వీర్యం చేసింది.ఈ ఆపరేషన్‌లో భారీ నష్టాలను చవిచూసిన పాకిస్థాన్, ఇక తట్టుకోలేక కాల్పుల విరమణ చేయాలని అభ్యర్థించింది. దీంతో మే 10న ఆపరేషన్ నిలిచిపోయింది. భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా, సాంకేతికతతో కూడిన శక్తిగా భారత రక్షణ దళాలు రూపాంతరం చెందుతున్నాయని ఈ శకటం స్పష్టం చేసింది.

# కోడలిపై ఇలా రివెంజ్ తీర్చుకున్న అత్తగారు!

**తాగు బోతు భర్తను మంచానికి కట్టేసిన మహిళ**

**ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్ జిల్లాలో ఘటన**

**కోడలు సోనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అత్త**

**భర్తే వేధింపులకు గురి చేస్తున్నాడన్న సోని**

**సోషల్ మీడియాలో ఫోటో, వీడియో వైరల్**



ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలీఘర్ జిల్లాలో ఒక విచిత్రమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఒక తాగుబోతు భర్తకు భార్య షాక్ ఇవ్వగా, కోడలిపై అత్త పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.పూర్తి వివరాల్లోకి వెళితే, హమీద్‌పూర్ గ్రామానికి చెందిన ప్రదీప్ అనే వ్యక్తి నిత్యం మద్యం సేవించి భార్య సోనిని వేధింపులకు గురిచేసేవాడు. అతని వేధింపులు భరించలేక, ఒకరోజు సోని తన భర్తను మంచానికి కట్టివేసింది. ఈ విషయం తెలుసుకున్న ప్రదీప్ తల్లి, కోడలు తన కొడుకును మంచానికి కట్టేయడాన్ని జీర్ణించుకోలేకపోయింది. దీంతో ఆమె కోడలిపై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంది. గతంలో సోని తుపాకీతో ఉన్న కొన్ని ఫోటోలు, వీడియోలను తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, కోడలు తన కొడుకును తుపాకీతో బెదిరిస్తోందని ఫిర్యాదు చేసింది.అత్త ఫిర్యాదు మేరకు పోలీసులు సోని ఇంట్లో సోదాలు నిర్వహించగా, అక్కడ ఎలాంటి ఆయుధాలు లభించలేదు. మరోవైపు, భర్త వేధింపులపై సోని కూడా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త నిత్యం మద్యం సేవించి వేధింపులకు గురిచేస్తున్నాడని, అందుకే తాను అతన్ని మంచానికి కట్టేయాల్సి వచ్చిందని ఆమె పోలీసులకు తెలిపింది. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.ప్రస్తుతం ఈ భార్యాభర్తల గొడవకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

# మరణానంతరం మామిడి రామారెడ్డికి పద్మశ్రీ

**మహిళా సంఘాలు, పాడి రైతులకు దక్కిన గౌరవం**

**కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంగల రామచంద్రారెడ్డి**



**భీమదేవరపల్లి జనవరి 26 (ప్రజా మంటలు) :** మరణానంతరం మామిడి రామారెడ్డి పద్మశ్రీ అవార్డు లభించడం బాధాకర మైనప్పటికీ, ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సహకార సంఘాలు, పొదుపు సంఘాలు, మహిళా సంఘాలు, పాడి రైతుల సభ్యులందరికీ దక్కిన అరుదైన జాతీయ గౌరవంగా భావించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంగల రామచంద్రారెడ్డి అన్నారు. మామిడి రామారెడ్డి (పిడిఎఫ్ రామారెడ్డి) గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం జీవితాంతం కృషి చేశారని, సహకార సంఘాలను సభ్యుల చేతుల్లోనే బలోపేతం చేసే విధంగా మ్యాక్స్ చట్టాన్ని రూపకల్పన చేసి అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావును ఒప్పించి అమలు చేయించిన సహకార పితామహుడని తెలిపారు. ఈ గౌరవాన్ని అన్ని సంఘాల సభ్యులు తమ గౌరవంగా భావించి ఆయన సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# ఏకేవీఆర్ కళాశాలలో ఘనంగా సిల్వర్ జూబ్లీ, గణతంత్ర దినోత్సవ వేడుకలు




**భీమదేవరపల్లి, జనవరి 26 (ప్రజా మంటలు) :** మండల కేంద్రంలోని ముల్కనూర్ గ్రామంలో గల ఏకేవీఆర్ కళాశాలలో 76వ గణతంత్ర దినోత్సవం, కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ వేడుకలకు హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అజ్మీర గోపాల్ నాయక్, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొమల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు విధులను కూడా ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవరుచుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిల్వర్ జూబ్లీ సందర్భంగా కళాశాల గత 25 సంవత్సరాల ప్రగతి, విద్యా రంగంలో సాధించిన విజయాలను అతిథులు ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న కళాశాల నుంచి అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో కళాశాల మరింత అభివృద్ధి చెందేలా అధ్యాపకులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రామ్ రెడ్డి, ఏ. సుదర్శన్ రెడ్డి, ఎస్.ఐ. రాజు, గ్రామ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, ఎం. కుమార్, మండల విద్యాధికారి సునీత రాణి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు, నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జాతీయతా భావం ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలు విజయవంతంగా ముగియడంతో కళాశాల ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**చిగురుమామిడి జనవరి 26 (ప్రజా మంటలు) :** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు మొదటగా ఇందుర్తి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాను అధ్యక్షుడు గాదె రఘునాథ్ రెడ్డి ఎగురవేశారు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్ జాతీయ జెండాను ఎగరవేశారు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయప్రభ జాతీయ జెండాను ఎగరవేశారు పశు వైద్యశాలలో డాక్టర్ సాంబ రావు ఎగరవేశారు ప్రభుత్వ హాస్టల్లో వార్డెన్ గోవర్ధన్ ఎగరవేశారు తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద మేనేజర్ ఫిఫ్త్ వార్డులో వార్డు సభ్యులు నడిగట్టు కిరణ్ జాతీయ జెండాను ఎగురవేశారు పాల కేంద్రం వద్ద అధ్యక్షులు సాయన్న ఎగరవేసరు మున్నూరు కాపు సంఘం కార్యాలయం ముందు అధ్యక్షులు చింతపూల అంజయ్య జాతీయ జెండాను ఎగురవేశారు అంబేద్కర్ సంఘం కార్యాలయం వద్ద అధ్యక్షుడు అందే బాబు జాతీయ జెండాను ఎగరవేశారు రైతు వేదిక వద్ద ఏఈఓ సతీష్ జాతీయ జెండాను ఎగురవేశారు అంగన్ వాడి కేంద్రాల వద్ద అంగన్వాడి టీచర్లు జాతీయ జెండాను ఎగరవేసరు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతపుల అనిల్ వార్డు సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ విద్యాసంస్థల భారీ జాతీయ పతాక ర్యాలీ



**జగిత్యాల, జనవరి 26 (ప్రజా మంటలు) :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలో రామకృష్ణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో భారీ జాతీయ పతాక ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల, చీూఎ డిగ్రీ కళాశాల, చీూఎ జూనియర్ కళాశాలలకు చెందిన సుమారు వెయ్యి మంది విద్యార్థులు 550 మీటర్ల పొడవైన జాతీయ పతాకాన్ని మోస్తూ పట్టణ పురవీధులలో తిరంగా ర్యాలీగా సాగించారు.అతి పొడవైన జాతీయ పతాకంతో జరిగిన ఊరేగింపును పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. జగిత్యాల పట్టణంలో తొలిసారిగా ఈ తరహా కార్యక్రమాన్ని రామకృష్ణ విద్యాసంస్థలు నిర్వహించడం గర్వకారణమని విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లోనూ, ప్రజల్లోనూ దేశభక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చీూఎ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పల్లెర్ల నరేష్, రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, చీూఎ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపు మునిందర్ రెడ్డి, కస్తూరి మల్లికార్జున్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


# మండలంలో ఘనంగా 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**భీమదేవరపల్లి, జనవరి 26 (ప్రజా మంటలు) :** మండల వ్యాప్తంగా 76 వ గణతంత్ర దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించగా, జనరల్ మేనేజర్ మారుపాటి రాం రెడ్డి సహకార జెండాను ఎగురవేశారు. అదేవిధంగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఈవో కిషన్ రావు జాతీయ జెండా ఆవిష్కరించారు. ముల్కనూర్లో భారతీయ జనతా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ వేడుకలు నిర్వహించగా, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని నేతలు పేర్కొన్నారు.తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మరియు గ్రామాలలో కూడా జాతీయ పతాకావిష్కరణలు ఘనంగా జరిగాయి.

# కొత్తకొండలో వీరన్నకు కోడె మొక్కు సమర్పించిన శాలినీ

**వేద ఆశీర్వాదాలతో ఘనంగా శాలినీ రెడ్డికి సన్మానం**



**భీమదేవరపల్లి, జనవరి 26 (ప్రజా మంటలు) :** శ్రీ వీరభద్ర స్వామి సమేత భద్రకాళి దేవి దర్శన భాగ్యానికి అనుగుణంగా సోమవారం రోజు కొత్తకొండ దేవస్థానంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ధర్మపత్ని శాలినీ రెడ్డి వీరన్నకు కోడె మొక్కును సమర్పించారు. గుమ్మడికాయను తలపై పెట్టుకుని స్వామివారి చుట్టూ కోడేతో ప్రదక్షిణ చేసి, అనంతరం కోడెతో పాటు గుమ్మడికాయను స్వామివారికి సమర్పించారు. అనంతరం వీరన్నకు విశేష అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి, తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. పూజాకార్యక్రమాల ముగింపు అనంతరం దేవస్థానం తరపున శేషవస్త్రంతో శాలినీరెడ్డికి సన్మానం నిర్వహించి, వేద ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు, అర్చక నందనం సందీప్, అర్చక మొగిలిపాలెం శివకుమార్, అర్చక నందనం శ్రవణ్ వేద ఆశీర్వాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగినందుకు శాలినీ రెడ్డి ఆలయ నిర్వాహకులకు, అర్చకులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com